
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
ఆదివారం 1 సెప్టెంబరు 2024



భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి - కలెక్టర్ కోయ శ్రీ హర్ష 6లో..

సీపీఎస్ విధానం రద్దు చేయాలని ఉపాధ్యాయుల నిరసన 6లో..

రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం

- సింగరేణి, జెన్‌కో సంయుక్త భాగస్వామ్యంతో నిర్మాణం
- పవర్ సర్‌ప్లస్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం... ఇతర రాష్ట్రాలకు విద్యుత్ విక్రయం...
- ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్
- మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ బాధ్యతలు
- ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల నిర్మాణాలకు అనుమతులు
- బహిరంగ సభలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



సింగరేణి యూనిఫాంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

గోదావరిఖని, ఆగస్టు 31: రామగుండంలో 800మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, రెవెన్యూశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శనివారం రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం పరిశీలన అనంతరం స్థానిక మెయిన్ చౌరస్తాలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని సర్‌ప్లస్ పవర్ స్టేట్‌గా మారుస్తామని, థర్మల్, సోలార్, హైడల్ విద్యుత్ కేంద్రాలను నెలకొల్పుతామన్నారు. రాష్ట్ర అవసరాలు పోను ఇతర రాష్ట్రాలకు విద్యుత్ విక్రయించే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళతామన్నారు. ఇప్పటికే రామగుండంలో విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకారం తెలిపారని, తన మాటగా రామగుండం ప్రజలకు హామీ ఇవ్వమని చెప్పారన్నారు. విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు విధానపరమైన నిర్ణయం జరిగిపోయిందని, సింగరేణి, జెన్‌కో సంయుక్త భాగస్వామ్యంతో నిర్మాణం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం కంటే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నామని, జెన్‌కో, ట్రాన్స్‌కో ఉద్యోగులు 24 గంటలు పనిచేస్తూ అత్యధిక పీక్ డిమాండ్‌ను కూడా అధిగమిస్తు న్నారన్నారు. ప్రస్తుతం 17,623 మెగావాట్ల పీక్ డిమాండ్ ఉందని, 2034-35 నాటికి 31,809మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేయా లన్న రెసో ఎలక్ట్రోల్ సర్వే అంచనా ప్రకారం ముందుకు పోతున్నామన్నారు. పీఎం కుసుమ్ క్రింద తెలంగాణ రాష్ట్రంలో 4,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, ఇందులో మహిళ సంఘాలకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ప్రతి మహిళ మహాలక్ష్మిగా తీర్చిదిద్దేందుకు రాబోయే ఐదేళ్లలో లక్ష కోట్ల వడ్డీ రుణాలను అందజేస్తా మని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై జాబ్ క్యాలెండర్ జారీ చేశామని, మూడు నెలల్లో 60వేల ఉద్యోగాలు ఇచ్చామని, మరో 60వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామన్నారు. గత ప్రభుత్వం గురుకులాల సౌకర్యాలకు రూ.3 కోట్లు కేటాయిస్తే తాము యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలకు రూ.5వేల కోట్లు కేటాయించా మన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో దోచుకుని విదేశాల్లో దాచుకునేవారని, కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అమెరికా, దక్షిణ కొరియాల నుంచి రూ.36వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారన్నారు. తెలంగాణ యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సింగరేణిని గత ప్రభుత్వం దోచుకుంటే తాము ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని, సింగరేణి కార్మికులకు రూ.కోటి, కాంట్రాక్టు కార్మికులకు రూ.30లక్షల బీమా సౌకర్యం కల్పించా మన్నారు. ప్రజలకిచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణ మాఫీని రూ.18కోట్లతో అమలు చేశామని, ఏ ముఖం పెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్ తమను అడుగుతారని ఆయన ప్రశ్నించారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రామగుండంలో పాలకుర్తి ఎత్తిపోతల పథకంతో పాటు కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు సబ్‌స్టేషన్లు, విద్యుత్ పోల్స్ అవసర మున్నా ఎమ్మెల్యే ద్వారా ప్రతిపాదనలు పంపితే మంజూరు చేస్తామని, ఓపెన్‌కాస్టు నిర్వాసిత ఆర్‌అండ్‌ఆర్ సమస్యతో పాటు ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఐజీ, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, సింగరేణి సీఎండీ బలరాంనాయక్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యేలు విజయరమణరావు, కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, మేయర్ అనిల్ కుమార్, అదనపు కలెక్టర్లు జే అరుణ, శ్యాంప్రసాద్‌లాల్, కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్‌ప్రసాద్, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, కార్పొరేటర్లు, కాంగ్రెస్ దాని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మేడిపల్లి ఓసీపీని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



బహిరంగ సభకు హాజరైన ప్రజలు

రామగుండంలో సాఫ్ట్‌వేర్ సెంటర్

- పెద్దపల్లి, సుల్తానాబాద్ మధ్య రూరల్ టెక్నాలజీ సెంటర్
- అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ
- 3500 డబుల్ బెడ్‌రూం ఇళ్లతో మోడల్‌కాలనీ
- మంత్రి శ్రీధర్‌బాబు



గోదావరిఖని, ఆగస్టు 31: రామగుండంలో భవనం సమకూర్చితే వంద మందికి ఉపాధి కల్పించే సాఫ్ట్‌వేర్ సెంటర్‌ను వెంటనే ఏర్పాటు చేస్తామని, భవిష్యత్‌లో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ మధ్య పది ఎకరాల స్థలంలో రూరల్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా ఐటీ రంగంలో యువతకు శిక్షణనిచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. విద్యతో పాటు నైపుణ్యం పెంపొందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ జరుగుతుందని, రుణ మాఫీ జరగలేదని బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారం చేస్తోందన్నారు. ఆధార్, కుటుంబ సభ్యుల వివరాలు లేని రైతుల వివరాలను వ్యవసాయ శాఖ సేకరిస్తోందని, త్వరలోనే వారందరికి రుణమాఫీ జరుగుతుందన్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ నిత్యం విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలని, తద్వారా రామగుండానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి రూ.8000కోట్లతో 800మెగావాట్ల పవర్‌ప్లాంట్‌ను మంజూరు చేసిందన్నారు. రామగుండంలో సింగరేణి స్థలాన్ని సేకరించి 3500డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్లతో మోడల్ కాలనీని నిర్మించాలన్నది రాజ్‌ఠాకూర్ లక్ష్యమని, త్వరలోనే దానిని పూర్తిచేస్తామన్నారు. సింగరేణి ప్రాంతంలో మిగిలిన 5వేల పట్టాలు, జెన్‌కో 1600కట్టడాలకు పట్టాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

రామగుండానికి 30 అదనపు బస్సులు..

- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



రామగుండం నియోజకవర్గానికి 30 అదనపు బస్సులు కేటాయించనున్నాం. మహాలక్ష్మి పథకానికి ఆర్‌టీసీ రూ.2500 కోట్లు ఇప్పటి వరకు ఖర్చు చేసింది. మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందిన రామగుండానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.

అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపనలు

- బీ థర్మల్ కేంద్రం, మేడిపల్లి ఓసీపీ పరిశీలన.. అధికారులతో సమీక్ష



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

గోదావరిఖని, ఆగస్టు 31: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం రామగుండంలో పర్యటించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు రాగా రామగుండం బీ పవర్‌హౌస్ వద్ద ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో ఘనంగా ఆహ్వానం పలికారు. గజమాలతో సత్కరించారు. అనంతరం జెన్‌కో విస్తరణ ప్రతిపాదనలపై భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు బీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం మేడిపల్లి ఓపెన్‌కాస్టుకు వెళ్లి సంప్‌డ్ స్టోరేజీ పవర్‌ప్లాంట్ ప్రతిపాదనలపై క్వారీని పరిశీలించారు. సింగరేణి సీఎండీ బలరాం నాయక్ సంప్‌డ్ స్టోరేజి పవర్ ప్లాంట్ నిర్మాణానికి మేడిపల్లి ఓసీపీ పూర్తి అనుకూలమని పేర్కొన్నారు. కన్సల్టెంట్ సిద్ధం చేసిన ప్రతిపాదనల గురించి ఎనర్జీ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, మంత్రులకు వివరించారు. అక్కడి నుంచి గోదావరిఖని మెయిన్ చౌరస్తాకు రాగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఇక్కడే రూ.88.5కోట్ల అమృత్ నిధులతో ఎస్‌టీపీల నిర్మాణం, టీయూఎఫ్ ఐడీసీ నిధులతో అభివృద్ధి పనులు, రూ.5కోట్ల సింగరేణి నిధులతో అంతర్గత రహదారుల పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం జరిగిన సభలో 211మహిళా సంఘాలకు రూ.23.35కోట్ల బ్యాంకు లింకేజీని ఉప ముఖ్యమంత్రి పంపిణీ చేశారు.

భట్టి బహిరంగ సభ సక్సెస్

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రామగుండం పర్యటన సందర్భంగా గోదావరిఖని మెయిన్‌చౌరస్తాలో ఏర్పాటుచేసిన బహిరంగ సభ సక్సెస్ అయ్యింది. వాతావరణం సహకరించకపోవడంతో రోడ్డుమార్గంలో వచ్చిన భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాక్‌లకు బీ పవర్‌హౌస్ వద్ద ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. మెయిన్ చౌరస్తా వద్ద బహిరంగ సభలో మంత్రులు, ఎమ్మెల్యేలకు సింగరేణి యూనిఫాం, హెల్మెట్, ల్యాంపు, కర్రలను సింగరేణి కార్మికులు అందించారు. వీటిని ధరించి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలకు అభివాదం చేశారు. భారీవర్షంలోనూ సభకు వచ్చిన జనం కదలలేదు. సాయంత్రం 4గంటల వరకు బహిరంగ సభ జరిగింది.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని సాధించాలి

- సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి గణేష్



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడతుఉన్న జడ్జి దుర్గం గణేష్

సుల్తానాబాద్, ఆగస్టు 31: విద్యార్థి దశలో ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని సుల్తానాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. మండలంలోని భూపతిపూర్‌లోగల కస్తూర్బా బాలికల కళాశాలలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్య తరగతి వారికి న్యాయ సహాయం అందించడానికి న్యాయసేవాధికార సంస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, న్యాయ సహాయం పొందాలనుకునే వారు సుల్తానాబాద్ కోర్టులోని లీగల్ సర్వీసెస్ సెల్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రతి విద్యార్థి పాజిటివ్ దృక్పథంతో అలోచించాలని, చదువుతో పాటు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం జడ్జి విద్యాలయంలోని భోజనశాలను పరిశీలించారు. బాలికలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని స్పెషల్ ఆఫీసర్ స్వప్నకు సూచించారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి, పెన్నులను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్, ఏజీపీ లక్ష్మీరాజం యాదవ్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధ్యాపకులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 31 : మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వనమహోత్సవంలో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లక్ష్మీనర్సయ్య, అధ్యాపకులు మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి రక్షణను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మురళి, నారాయణ తదితరులున్నారు.

భట్టి వస్తే ఏం చెబుతారన్న వారికి పవర్ ప్లాంటే జవాబు

- సింగరేణి ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చాలి
- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, ఆగస్టు 31: రామగుండంకు భట్టి వచ్చి ఏం చెబుతారని కొందరు ప్రశ్నించారని, వారందరికి 800మెగావాట్ల పవర్ స్టేషన్ ఏర్పాటే జవాబు అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శనివారం గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. భట్టి పాదయాత్రలోనే రామగుండం జెన్‌కో విద్యుత్ కేంద్రం విస్తరణకు హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రి శ్రీధర్‌బాబు ఈ విద్యుత్ కేంద్రం మంజూరుకు చొరవచూపారన్నారు. రామగుండానికి పూర్వవైభవం తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రామగుండం నగర అభివృద్ధికి రూ.200కోట్ల నిధులు ఇవ్వాలని, పాలకుర్తి లిఫ్ట్ మంజూరుచేయాలన్నారు. సింగరేణి ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చి మెడికల్ కళాశాలకు అనుబంధం చేసి ప్రజలందరికి వైద్య సదుపాయం సౌకర్యం కల్పించాలన్నారు. వైఎస్ఆర్ హయాంలో మిగిలిన 6వేల ఇండ్లకు పట్టాలు, జెన్‌కో స్థలాల్లోని 1600కట్టడాలకు పట్టాలు ఇవ్వాలన్నారు. గోదావరిఖని, వైటింక్లయిన్‌కాలనీ స్టేడియంకు రూ.2కోట్లు ఖర్చు పెడితే అంతర్జాతీయ స్థాయి స్టేడియంలుగా మారుతాయని, వాటికి నిధులు మంజూరు చేయాలన్నారు రామగుండం, ఎన్‌టీపీసీ, సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీఎం నెం.22ప్రకరం వేతనాలు ఇవ్వాలని కోరారు. రామగుండాన్ని ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని, లింగాపూర్ ఎస్‌సీ కాలనీ వాసులకు ఆర్‌అండ్‌ఆర్ సౌకర్యం కల్పించాలన్నారు. సింగరేణి భూములను అప్పగిస్తే పేదలకు ఇండ్లు నిర్మించి ఇస్తామని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సింగరేణి, జెన్‌కోల ఆధ్వర్యంలో బీ థర్మల్ కేంద్రం విస్తరణ : భట్టి

అంతర్గాం, ఆగస్టు 31: త్వరలో సింగరేణి, జెన్‌కో సంస్థల ఆధ్వర్యంలో బీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని 800మెగావాట్ల పవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతామని రాష్ట్ర డిప్యూటీ సీఎం మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి రామగుండం పట్టణంలోని 62.5మెగావాట్ల బీ థర్మల్ కేంద్రాన్ని సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం మాట్లాడారు. అప్పటి టెక్నాలజీ ప్రకారం 1971లో ప్రారంభమైన బీ థర్మల్ విద్యుత్ కేంద్రం ఇప్పటి వరకు దేశానికి వెలుగులు అందిస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తాను సీఎల్‌పీ నేత హోదాలో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు బీ థర్మల్ కేంద్రాన్ని విస్తరించి తీరుతామని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తరచూ బీ థర్మల్ కేంద్రం విస్తరణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన క్రమంలో విస్తరణ కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు కోటి రూపాయల ఇన్సూరెన్స్ పథకంను ప్రవేశ పెట్టి ఘనత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీ థర్మల్ నిర్మాణానికి అవసరమయ్యే భూమి, నీరు, బొగ్గుకు సంబంధించిన అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష, జెన్‌కో, సింగరేణి అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు వివేక్, విజయరమణరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రేమ్‌సాగర్‌రావు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బీ థర్మల్ ఎస్ఈ విజయేందర్, యూనియన్ నాయకులు అబ్దుల్ తఖి, సలీం, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కూలిన ప్రాచీన పాండురంగ దేవాలయం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31: నగరంలోని పాతబజార్ 49వ డివిజన్ పరిధిలోని అతి ప్రాచీన శ్రీపాండురంగ దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో కురుస్తున్న వర్షాలతో స్లాబ్ పైకప్పు, గోడలు కూలి పోయాయి. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ చల్లస్వరూప రాణి హరిశంకర్ స్థానిక కార్పొరేటర్ కమల్ జిత్‌కౌర్ సోహెన్‌సింగ్‌తో కలిసి శనివారం ఆలయాన్ని పరిశీలించారు. ఆలయంపై కప్పు, గోడలు కూలినందున భక్తులు, ప్రజలు ఎవరు కూడా ఆలయంలోకి వెళ్ళవద్దని సూచించారు. కూలిపోయిన గోడలు, పైకప్పును తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వేదపండితులు బ్రహ్మశ్రీ మంగళంపల్లి వేణుగోపాల శర్మతో, భూ యజమానితో మాట్లాడి ఆలయ పునర్నిర్మాణం చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందించి నిర్మాణాన్ని ప్రారంభించాలని డిప్యూటీ మేయర్ సూచించారు.

కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి కేంద్ర మంత్రి భూమి పూజ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్ కుమార్ నగరంలో కమ్యూనిటీ భవనాలకు నిధులు కేటాయించి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. శనివారం 29వ డివిజన్ కాపువాడలో నిర్మించనున్న కాపువాడ కమ్యూనిటీ భవనానికి రూ.15 లక్షలు, 13వ డివిజన్ పెద్దమ్మ కాలనీలో వడ్డెర కమ్యూనిటీ హాల్‌కు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుగ్గిళ్ళపు రమేశ్, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీతో కలిసి కమ్యూనిటీ భవనాలకు శంఖుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కాపువాడలో శంకుస్థాపన చేస్తున్న బండి సంజయ్‌కుమార్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా
దశల వారీగా ఆందోళనలు

సుభాష్‌నగర్, ఆగస్టు 31: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబరు 2 నుంచి దశల వారీగా ఆందోళనలు చేపట్టాలని ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జేఎస్‌రావు, సీనియర్ న్యాయవాది కొరివి వేణుగోపాల్, కరీంనగర్ అధ్యక్షుడు బద్దం డానియల్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక కార్ఖానగడ్డలో గల అంబేద్కర్ మెమోరియల్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సెప్టెంబరు 2న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన, అనంతరం వినతిపత్రాల అందచేత, 11న ఎమ్మెల్యే, ఎంపీ, చైర్మన్, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. 16న కలెక్టరేట్ ఎదుట నిరసనలు, 27న చలో హైదరాబాద్, అసెంబ్లీ ముట్టడి ఉంటుందని తెలిపారు. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు వర్గీకరణకు, క్రిమిలేయర్‌కు అనుకూలమా, వ్యతిరేకమా స్పష్టం చేయాలన్నారు. సమావేశంలో వంచిత్ బహుజన్ ఆఘాడి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తీగల శేఖర్, గంగాధర్, దశరథం, ఎడ్ల రామకిషన్, టి ఓంప్రకాశ్, గంభీరావు పేట అంజయ్య, దొంత రాజేశం, కాంపెల్లి రమణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 31: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఆలయ పీఆర్వో అశోక్, సూపరింటెండెంట్ తిరుపతిరావులు, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లను పరిశీలించారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు..

శ్రావణ మాసం పురస్కరించుకుని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు భీమేశ్వర స్వామి వారి ఆలయంలోని శనీశ్వరుడికి భక్తులు నువ్వుల నూనేతో అభిషేకం నిర్వహించి స్వామి వారికి నల్లబట్టను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగ్గురు ఉద్యోగుల పదవీ విరమణ..

రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న సూపరింటెండెంట్ అల్లి శం కర్, ముఖ్య అర్చకులు అప్పాల కరుణాకర్, స్కావెంజర్ జాక్పాల్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఆవరణలో ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ ఉద్యోగుల కార్యదర్శి కూరగాయాల శ్రీనివాస్, ఈఈ రాజేష్, ఏఈవోలు జయకుమారి, శ్రీనివాసు పదవీవిరమణ పొందిన వారిని సత్కరించారు. అప్పాల కరుణాకర్ సుధ దంపతులు నిర్వ హించిన వీడ్కోలు సమావేశానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై సన్మానించారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	15,689	4,825	80.5	60.823
ఎల్లంపల్లి	14,302	6,580	20.175	18.063
మిడ్ మానేరు	10,450	19,550	27.54	14.98
ఎల్ఎండీ	4.100	253	24.034	12.923

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, ఆగస్టు 31: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ అన్నారు. శనివారం కరీంనగర్ సర్కిల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేబుల్, బ్రాడ్ బ్యాండ్ ఆపరేటర్లు కేబుల్‌లను విద్యుత్ స్తంభాలపై క్రమ పద్ధతిలో ఉంచాలన్నారు. బ్రేక్ డౌన్ పునరుద్ధరించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలన్నారు. కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండటం వలన వినియోగదారులు విద్యుత్ వైర్లకు, కేబుల్ వైర్లకు తేడా తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం పోల్ రెంటల్ చార్జీలను వసూలు చేయాలన్నారు. వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన పంపుసెట్లకు విద్యుత్ ఇవ్వడానికి అంచనాలు వర్క్స్ ఆర్డర్లను త్వరగా మంజూరు చేసి 30-40 రోజుల వ్యవధిలో కొత్త వ్యవసాయ కనెక్షన్లను మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం ఈనెల 17నుంచి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి లబ్ధి పొందని వినియోగ దారులు దరఖాస్తులను ఇవ్వడానికి అవగాహన కల్పించాలని తెలిపారు.



కరీంనగర్ సర్కిల్ అధికారుల సమావేశంలో ఎస్ఈ

● వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ సూచించారు. తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియజేయాలని అన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదన్నారు. ఉతికిన బట్టలు ఇనుప తీగలపై ఆరవేయకూడదని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● నలుగురికి తీవ్ర గాయాలు



తాడూరి రాజమౌళి(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 31: వివాహానికి వెళ్తూ ఓ వ్యక్తి మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన తాడూరి రాజమౌళి(60) తన సోదరుడి కుమారుడి వివాహం శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని మత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో ఏర్పాటు చేశారు. వివాహానికి హాజరయ్యేందుకు శనివారం తెల్లవారుజామున గ్రామం నుంచి తాడూరి గంగయ్య మరి కొందరితో కలిసి ఆటోలో బయల్దేరి వెళ్లారు. ఆటో సింగాపూర్ శివారులోని వెన్నంపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే ఓ గుర్తు తెలియని వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తాడూరి రాజమౌళి తలకు బలమైన గాయం కాగా, ఆటోలో ప్రయాణిస్తున్న తాడూరి హనుమయ్య, తాడూరి ధర్మయ్య, అక్షయ తిరుపతి, తాడూరి గంగయ్య, పల్లె కొమురయ్య, పల్లె హర్షవర్ధన్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాడూరి రాజమౌళిని ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ విచారం వ్యక్తం చేశారు.

టేకు చెట్ల నరికివేత



నరికివేసిన టేకు చెట్టు

వీర్నపల్లి: ఆగస్టు 31: మండలంలోని అల్మాస్‌పూర్ అటవీ సెక్షన్ పరిధిలోని కంచర్ల శివారులోని లచ్చక్క గుడ్డంలో ఏపుగా పెరిగిన టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి అటవీ ప్రాంతంలోనే సైజులుగా మార్చి రహస్యంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రైతులు సొంత చేలలో చెట్లు నరికితే కేసులు పెడుతున్న అధికారులు అటవీ సంపదను నాశనం చేస్తున్న పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల నరికివేతపై ఎఫ్ఎస్ఓ పద్మలతను వివరణ కోరగా ప్రతిరోజు అటవీ ప్రాంతంలో నిఘా పెడు తున్నామని, చెట్లను నరుకుతున్న వారిని పట్టుకొని కేసులు నమోదు చేస్తామన్నారు.



అటవీప్రాంతంలో నరికివేసిన టేకు చెట్టు

ఇద్దరు డీజే నిర్వాహకులపై కేసు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 31: ఎలాంటి అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద, వెంకంపేట వద్ద రోడ్లపై డీజేలు పెట్టుకొని ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న డీజే యజమానులైన పి. పవన్‌కుమార్, గోలి రాజేందర్‌పై వేర్వేరుగా కేసు నమోదు చేశామన్నారు. రెండు డీజేలను సీజ్‌చేశామన్నారు. డీజే యజమానులను అరెస్ట్‌చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. జిల్లాలో డీజే యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చామని, అయినప్పటికీ పోలీసుల సూచనలు బేఖాతరు చేయడం వల్ల కఠినచర్యలు తీసుకుంటున్నామన్నారు. గణేశ్ మండపాల వద్ద పోలీసు అధికారుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు రాత్రి 10గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. డీజేల వలన చిన్నపిల్లలు, విద్యార్థుల చదువునకు , వృద్ధుల ఆరోగ్యానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని డయల్ 100కు కాల్స్ రావడంతో వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసినా, యాంప్లిఫైయర్‌తో బాక్స్‌లు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేశ్ మండపాల్లో, శోభాయాత్రలోనూ డీజేలు ఏర్పరిచి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఎవరైనా డీజేలు ఏర్పాటుచేస్తే యజమానులు, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గంభీరావుపేట, ఆగస్టు 31:మండలంలోని నర్మాల మానేరు క్యాంపు మైసమ్మ ఆలయం సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడిన దేవేందర్‌గౌడ్ అనే వ్యక్తి శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం సింగరాయపల్లి గ్రామానికి చెందిన దేవేందర్‌గౌడ్ గంభీరావుపేట మండలం శ్రీగాధలోని తన అత్తగారింటికి వెళ్లే క్రమంలో నర్మాల మానేరు ప్రాజెక్టు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో దేవేందర్‌గౌడ్ ముఖం, కాళ్లు చేతులతో పాటు తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దేవేందర్‌గౌడ్ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, రెండు నెలల పాప ఉన్నారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

మల్యాల, ఆగస్టు 31: దిగువ కొండగట్టులో శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఇతర సిబ్బంది టిఫిన్ సెంటర్లు, హోటళ్లను పరిశీలించారు. కొన్ని హోటళ్లలో కుళ్లిన వస్తువులు, కాలం చెల్లిన తిండి పదార్థాలను గుర్తించి వాటిని పడేశారు. పరిశుభ్రతతో శుచి, శుభ్రతతో నాణ్యత గల వాటినే ప్రజలకు అందించాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో తనిఖీల సమయంలోనూ పాడైన వస్తువులు లభించగా తీరు మారకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లకు లైసెన్స్‌లు తీసుకోవాలని, లైసెన్స్‌లు ఉన్న వారు వారం రోజుల్లోగా రెన్యూవల్ చేసుకోవాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జమ్మికుంటలో గంజాయి పట్టివేత

జమ్మికుంట, ఆగస్టు 31: జమ్మికుంట రైల్వేస్టేషన్ నుంచి బల్లార్షకు గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. జమ్మికుంట పట్టణానికి చెందిన యండి శమీమ్ అనే మహిళ బల్లార్షకు గంజాయి తరలించేందుకు రైల్వేస్టేషన్ చేరుకుంది. సమాచారం అందుకున్న అబ్కారీ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సదరు మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద ఉన్న 490గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, తహశీల్దార్ ఎదుట హాజరు పరిచారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో అబ్కారీ సీఐ మాధవీలత, ఎస్సై సౌమ్య, కానిస్టేబుళ్లు అయిలయ్య, పెద్దన్న, భాస్కర్, మహేష్, పద్మావతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

● రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ● ఎనుమాముల మార్కెట్‌లో అధికారులతో సమీక్ష

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 31: వ్యవసాయ మార్కెట్లలో రైతులకు మెరుగైన సేవలందించమే తమ ముందున్న లక్ష్యమని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి అన్నారు. శనివారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏనుమాముల, జనగామ, జమ్మికుంట, మహబూబాబాద్, ఖమ్మం మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులు ఏనుమాముల మార్కెట్‌లోని పలు సమస్యలను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. మార్కెటింగ్ శాఖలో ముఖ్యంగా మార్కెట్లలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉన్న అధికారులు, సిబ్బందితో ప్రస్తుతం ఉన్న సాంకేతికతను జోడించి మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏనుమాముల మార్కెట్‌లో ఉన్న వేబ్రిడ్జిలను మరమ్మతు చేయించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. లక్ష్మీపురం, మార్కెట్‌తో పాటు ఏనుమాముల మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. మార్కెట్‌లో దడువాయిలు వాడే పీవోఎస్ మిషన్లు కొత్తవి కొనుగోలు చేస్తున్నామని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. మార్కెట్‌లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఒక్కో మార్కెట్ స్థితిగతులు, అక్కడి సమస్యలు, మార్కెట్ ఫీజువసూళ్లు, అలాగే అభివృద్ధి పనులపై సంబంధిత కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సీజన్ ప్రారంభం కాకముందే అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని సూచించారు. మార్కెట్ ఫీజు పెండింగ్ లేకుండా వసూలు చేయాలని, ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో కె.సురేఖ, ఏనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, గ్రేడ్- 2 కార్యదర్శులు అజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

మార్కెట్ కమిటీ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మార్కెట్ కమిటీ కార్యదర్శులకు సూచించారు. శనివారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో వరంగల్, జనగామ, జమ్మికుంట, ఖమ్మం, మహబూబాబాద్ మార్కెట్ కమిటీల కార్యదర్శులతో మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్‌లతో కలిసి లక్ష్మీబాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో మార్కెట్ కమిటీ స్థితిగతులు, అక్కడి సమస్యలు, మార్కెట్ ఫీజు వసూళ్లు, అలాగే అభివృద్ధి పనులపై సంబంధిత కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సీజన్ ప్రారంభం కాకముందే అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. మార్కెట్ ఫీజు పెండింగ్ లేకుండా వసూలు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో కె.సురేఖ, ఎనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, జన్ను భాస్కర్, లాషరీఫ్, పి.అశోక్, జీవన్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 31: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గీతాభవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. బీసీ సమగ్ర కులగణన చేపట్టి రాజ్యాధికారంలో బీసీల వాటా తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీల కులగణన కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడానికి స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కుల గణన ప్రారంభించే వరకు ప్రభుత్వంపై తమ పోరాటం ఆగదన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాలను ప్రశ్నిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారాజు రాకేష్‌చారి, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాస సంజీవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగు సంపత్ గౌడ్, ఎడ్ల సురేందర్, బ్రహ్మాచారి, నలవెలి రవి, బండారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారు ఆభరణాల అపహరణ

శంకరపట్నం, ఆగస్టు 31: శంకర పట్నం మండలం మొలంగూర్ పరిధిలోని గుడాటిపల్లి గ్రామంలో ఇంటి తాళం పగల గొట్టి చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రం సంజీవరెడ్డి భార్యతో కలిసి ఈ నెల 30న సాయంత్రం తన కుమారుడి కొడుకు పుట్టిన రోజు ఫంక్షన్‌కు కరీంనగర్‌కు వెళ్లాడు. తిరిగి శనివారం ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా తాళం పగలగొట్టి వస్తువులు చిందర వందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో అక్కడికి చేరుకొని వివరాలను నమోదు చేసుకొని వేలిముద్రలు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

భార్య చికెన్ వండలేదని ఆత్మహత్య



కిశోర్(ఫైల్)

సుల్తానాబాద్, ఆగస్టు 31: చికెన్ తీసుకుని ఇంటికి వచ్చిన భర్త వండమని భార్యకు చెప్పాడు. ఇంటి పనిలో బిజీగా ఉన్న భార్య కాసేపు ఆగిన తర్వాత వండుతానని చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన భర్త ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాల గ్రామానికి చెందిన పూసాల కిశోర్(33) కార్పెంటర్. తాగుడుకు బానిసై పనిలేకుండా తిరుగుతూ అప్పుడప్పుడు కూలీ పనికి వెళ్లి వచ్చిన డబ్బును తాగుడుకే ఖర్చు చేస్తున్నాడు. దాంతో ఇంట్లో పూట గడవక భార్య సుల్తానాబాద్ పట్టణంలోని ఓ కిరాణా షాపులో పనిచేస్తోంది. ఆ వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తోంది. శనివారం రాత్రి ఇంటికి చికెన్‌తో వచ్చిన కిశోర్ తన భార్యను కూర వండమని చెప్పాడు. కొంత సేపాగి వండుతానని భార్య చెప్పడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31: తనకు రావాల్సిన వాటా భూమి విషయంలో సోదరుడితో వివాదం విషయంలో మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కొప్పుల చంద్రకాంత్(45) చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. వల్లంపహాడ్‌కు చెందిన కొప్పుల చంద్రకాంత్ భూమి విషయంలో సోదరుడితో గొడవపడి ఈ నెల 24న వెంకటేశ్వర ఆలయం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యక్తికి జరిమానా

ఇల్లంతకుంట, ఆగస్టు 31: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన మొల్లంకుల బాలయ్య ఇతరులకు అప్పులు ఇచ్చి అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడని శనివారం కలెక్టర్ రెండు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకున్న బాలయ్య అధికంగా వడ్డీ వసూలు చేస్తున్నాడనే ఫిర్యాదు మేరకు ఏప్రిల్ నెలలో దాడి చేశామని తెలిపారు. బాలయ్య వద్ద ప్రామిసరీ నోట్స్, చెక్కులు, డాక్యుమెంట్లు లభించగా కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎదుట హాజరుపర్చగా రెండు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత

కరీంనగర్ క్రైం/భగత్‌నగర్, ఆగస్టు 31: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ప్రయాణికుడి సెల్‌ఫోన్‌ను దొంగలిస్తుండగా సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది రెడ్‌హ్యాం డెడ్‌గా పట్టుకున్నారు. బస్టాండ్‌లోని 14వ ప్లాట్‌ఫాం వద్ద జి.శ్రీనివాస్ అనే ప్రయాణికుడు బస్‌లోకి ఎక్కుతుండగా శనివారం చెన్నూర్‌కు చెందిన ఎం.సతీష్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ చోరీకి యత్నించాడు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్పతి, కానిస్టేబుల్ రమణ, కొమురయ్య, కవితలు పట్టుకున్నారు. అనంతరం సతీష్‌ను, సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ● మిడ్ మానేరు నిర్వాసితులతో సమావేశం

వేములవాడ టౌన్, ఆగస్టు 31: మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితల సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, కొడుముంజ, అనుపురం, శభాష్‌పల్లి, చింతలఠాణ, గుర్రంవానిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో శనివారం సహావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమా నికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వారీగా సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. తమ ఇళ్లకు పరిహారం, పట్టాలు, 18 ఏళ్లు నిండిన వారికి పరిహా రం, ఆల యాలకు పరిహారం రాలేదని ఇతర సమస్యలను ప్రభుత్వ విప్, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తమ గ్రామాలకు సరిహద్దులు చూపాలని, ఆక్రమణలు నిరోధించాలని, శ్మశాన వాటికల వద్ద సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముంపు గ్రామాల పరిధి లో వెలిసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు అనుమతులు ఉన్నాయా? డీటీసీపీ అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలని, ప్రభుత్వ భూము లపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశిం చా రు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మానవతా దృక్ప థంతో అందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పరిహారం వచ్చేలా కృషి చేస్తాన ని స్పష్టం చేశారు. నోటిఫైడ్ కానీ వారి దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయి స్తామని, అర్హులైన ప్రతీఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, ఏస్డీసీ రాధాబాయ్, డీఆర్డీవో శేషాద్రి, తహసీల్దార్ మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

పోలీసుల అదుపులో బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి

కోరుట్ల, ఆగస్టు 31: పట్టణానికి చెందిన ఓ రియల్టర్‌ను ఫోన్‌లో డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని కోరుట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల నుంచి పట్టణంలో ప్రకాశం రోడ్డుకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారికి డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాలుపడుతున్న విషయంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి పథకం ప్రకారం పట్టుకున్నారు. మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి పట్టణంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారికి వారం రోజుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ ఓ వ్యక్తి ఫోన్ చేస్తూ బెదిరిస్తున్నాడు. మొదట రూ. 50లక్షలు కావాలని ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో సదరు వ్యాపారి తనవద్ద అంత డబ్బులేదని ఫోన్ పెట్టేసాడు. మళ్లీ కొత్త నంబర్లతో ఫోన్ చేసి రూ. 5లక్షలైనా ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దీంతో గంట తరువాత ఫోన్ చేయండి అని చెప్పి వ్యాపారి విషయాన్ని పోలీసులకు తెలిపాడు. రియల్టర్‌కు గంట తరువాత మళ్లీ ఫోన్ రావడంతో పోలీసుల సూచన మేరకు సదరు వ్యక్తిని రైల్వేస్టేషన్ వద్దకు రావాలని సూచించాడు. బెదిరింపులకు పాలుపడిన వ్యక్తి మరో వ్యక్తితో కలిసి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అప్పటికే అక్కడ మాటువేసిన పోలీసులు పథకం ప్రకారం ఆ వ్యక్తులను అదుపులోకి తీసుకోని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. సదరు వ్యక్తి 6 నెలల క్రితం పోలీసుల వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా తన వాహనంలో పిస్తోల్‌తో దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కొన్ని రోజుల క్రితం జైల్ నుంచి వచ్చిన సదరు వ్యక్తి మరో కేసులో ఇరుక్కుని పోలీసులకు చిక్కడంతో చర్చనీయాశంగా మారింది.

ఎరువుల అమ్మకాల్లో నిధుల దుర్వినియోగం

● ముగ్గురు అధికారుల అరెస్టు

వేములవాడ రూరల్, ఆగస్టు 31: మార్క్‌ఫెడ్‌లో ఎరువుల అమ్మకాల్లో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ముగ్గురు నిందుతులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మార్క్‌ఫెడ్‌లో ఎరువుల అమ్మకాలకు సంబంధించి బకాయిల అవకతవకలున్నట్లు గమనించిన యాజమాన్యం చీఫ్ అకౌంట్స్ ఆధికారికి విచారణ చేయమని జూలై నెలలో ఆదేశాలిచ్చింది. విచారణ చేపట్టిన అధికారి సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. వేములవాడ డీసీఎంఎస్‌కు సంబంధించి 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 76,77,325 రూపాయల అవకతకవకలు జరిగినట్లు గుర్తించారు. జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి రమేష్ తన భార్య పేరుతో ఎరువుల షాప్ కోసం లైసెన్స్ తీసుకున్నాడు. మార్క్‌ఫెడ్‌కు అడ్వాన్స్ చెల్లించి ఎరువులను తీసుకోవాల్సి ఉండగా అకౌంటెంట్ భాస్కర్ సాయంతో నగదు చెల్లించినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. నకిలీ పత్రాలతో జిల్లా మేనేజర్ దివ్యభారతికి బకాయిలు లేనట్లుగా చూపించి ఎరువులను పొంది బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని 76,77,325 రూపాయలు సొంతానికి వాడుకున్నారు. విచారణ అనంతరం మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి రమేష్‌ను,అకౌంటెంట్ భాస్కర్‌ను విధుల నుంచి తొలగించారు. అనంతరం రమేష్, భాస్కర్‌తో పాటు విధుల్లో బాధ్యతారహితంగా వ్యవహరించిన జిల్లా మేనేజర్ దివ్యభారతిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మార్క్‌ఫెడ్ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. దీంతో శనివారం జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేష్, అకౌంటెంట్ భాస్కర్, జిల్లా మేనేజర్ దివ్యభారతిలను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

6న ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 31: ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 6న ఉమ్మడి జిల్లా బాలుర సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించనున్నారు. రామడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 9గంటల నుంచి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను వరంగల్ జిల్లా హన్మకొండలో 14, 15 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ అలవడుతాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. అసోసియేషన్ ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, పుట్టినతేదీ సర్టిఫికె ట్‌ను వెంట తీసుకొని సంఘ సంయుక్త కార్యదర్శి ఎన్. ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్‌లకు రిపోర్టు చేయాలని తెలిపారు. వివరాలకు ఫోన్. 9441925807 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

పాపన్న గుట్టలను పరిశీలించిన అధికారులు



సర్వాయి పాపన్న గుట్టల వద్ద అధికారులు

సైదాపూర్, ఆగస్టు 31: సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట శివారులో ఉన్న సర్వాయి పాపన్న గుట్టలు, ఆ ప్రాంతాన్ని టూరిస్టు స్పాట్‌గా ఏర్పాటు చేయుటకు టూరిజం అధికారులు డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్‌రెడ్డి హుజూరాబాద్ డీఐ పాయబ్ అలీ, సైదాపూర్ తహసీల్దార్ దూలం మంజులలు పర్యటించి పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సర్వాయి పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు నిధులు విడుదల చేయడంతో ముందుగా ఆ నిధులతో ఏఏ పనులు చేపట్టాలో పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్, సర్వాయర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీకి యత్నం

కొడిమ్యాల, ఆగస్టు 31 : కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారికి సమీపంలో మండలంలోని పూడూర్‌లో ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గుర్తు తెలియని వ్యక్తి శనివారం తెల్లవారుజామున సుమారు రెండున్నర గంటల ప్రాంతంలో ఏటీఎంను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. సంఘటన స్థలాన్ని మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ పరిశీలించారు. పోలీసులు క్లూస్ టీంతో తనిఖీలు చేశారు.

లారీ కింద పడి యువకుడి మృతి

చొప్పదండి, ఆగస్టు 31: మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన దాసరి సంజీవ్ (28) లారి కింద పడి మృతి చెందాడు. ఎస్ఐ అనూష కథనం మేరకు సంజీవ్ తన బైక్‌పై వెళ్తుండగా బైక్ పాడైపోవడంతో చొప్పదండి శివారులోని పెట్రోల్ పంపు దగ్గర ఆగాడు. వర్షం పడుతుండడంతో అక్కడ ఆగి ఉన్న లారీ వెనుకాల కూర్చున్నాడు. లారీని డ్రైవర్ స్టార్ట్ చేయగా సంజీవ్ కాలుపై నుంచి టైరువెళ్లడంతో కుడికాలు విరిగిపోయింది. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సంజీవ్ మృతి చెందాడు.

దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉంది

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: భారత దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు అప్పన్నగారి వెంకట్రావ్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో సెప్టెంబరు 3, 4 తేదీలో జరిగే మోగా ఇంపాక్ట్ ప్రోగ్రాం వాల్‌పోస్టర్‌ను ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ ప్రస్తుతం యువతకు జీవితం, సమాజంపై అవగాహన లేకపోవడంతోనే దారుణాలు జరుగుతున్నాయని అన్నారు. వీటిపై అవగాహణ కల్పించడానికి కరీంనగర్‌లో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రోగ్రాంపై ఎలాంటి సందేహాలు ఉన్నా సెల్ : 9676004408 నెంబర్‌కు ఫోన్ చేసి తీర్చుకోవచ్చనని అన్నారు. సమావేశంలో ఉత్తర తెలంగాణ రీజినల్ డైరెక్టర్ కుతాడి తిరుపతి, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి సిరిసిల్ల బాలకృష్ణ, అధ్యక్షుడు కోడం బాలకిషన్ ఉన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు

నైపుణ్యత, నాయకత్వ వేడుకలు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 31: గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లోని ఆపిల్‌కిడ్స్ పాఠశాలలో శనివారం నైపుణ్యత, నాయకత్వ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కలిగిన విద్యార్థులను క్లాస్, కల్చరల్, హౌస్‌కెప్టెన్, హెడ్ గర్ల్, పాఠశాల గ్రూప్ నాయకత్వానికి ఎంపికలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ గాలి సునీత, ఇంచార్జీ అరుణ, ఉపాధ్యాయులు ఫర్హాన, సుస్మిత, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఎంపిక ప్రక్రియ

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 31: గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌సీసీలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ ఎంపిక కార్యక్రమానికి ఎన్‌సీసీ బెటాలియన్ కరీంనగర్ నుంచి నాయబ్ సుబేదార్ రమేష్, హవల్దార్ ఆదినాథ్ హాజరయ్యారు. ఎంపికలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఎత్తు, బరువు కొలతలతోపాటు శారీరక ధృడత్వం వంటి పోటీలు జరుగగా 28మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, వైస్‌ప్రిన్సిపల్ సాంబశివరావు, ఎన్‌సీసీ అధికారి భూక్యా తిరుపతి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఔషధ గుళికల పంపిణీ

సుల్తానాబాద్, ఆగస్టు 31: సుల్తానాబాద్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన స్వర్ణామృత ఔషద గుళికల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం చైర్‌పర్సన్ లక్ష్మీ ప్రారంభించారు. వికాస తరంగిణి కోఆర్డినేటర్ సునిత, పొదిల్ల రమేష్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సత్కారం

రామగిరి, ఆగస్టు 31: మండలంలోని ఆదివారంపేట్ గ్రామ యూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామోదర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా మాజీ సర్పంచ్ షైదం కుమార్, గ్రామస్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 31 : సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జీవన్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాలు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల హామీలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి 9నెలలు అవుతున్నా సానుకూల చర్యలు చేపట్టలేదన్నారు. పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని జిల్లాలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని ఐక్య ఉద్యమాలను విజయవంతం చేయాలని కోరారు.

ధర్మారంలో భారీ వర్షం

ధర్మారం, ఆగస్టు 31: మండలంలో శనివారం తెల్లవారు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా పలు గ్రామాల్లోని రోడ్లు బురదయమయ్యాయి. పంటపొలాల్లోకి వర్షం నీరు చేరుకుంది.

విద్యార్థుల సామర్థ్యాల పెంపుపై శిక్షణ

జూలపల్లి, ఆగస్టు 31 : ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సామర్థాలపై కాంప్లెక్సుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన రెండు రోజులు శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమానికి హాజరైనా మండల విద్యాధికారి కవిత మాట్లాడుతూ విద్యార్థులలో భాషా, గణిత సామర్థ్యాల పెంపు కోసం దశలవారిగా లక్షాలను సాధించుకునేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి, తెలుకుంట కాంప్లెక్సుల పరిధిలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై సమావేశం

జూలపల్లి, ఆగస్టు 31: బీజేపీ మండల సభ్యత్వ నమోదు కార్యశాల సమావేశం శనివారం పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జరిగింది. సమావేశానికి సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ హాజరై మాట్లాడుతూ ప్రతి బూత్ నుంచి 200 సభ్యత్వాలను నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం సెప్టెంబరు 5న ప్రారంబమై అక్టోబరు 30న ముగుస్తుందన్నారు. మెండె రాజన్న, బొజ్జ సంపత్, సంపత్ రావు, భూసారపు రవిందర్‌గౌడ్, కూనిరాజుల అజయ్, బడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 31: గోదావరి బ్రిడ్జి వద్ద పెట్రోల్‌బంక్ సమీపంలో శనివారం కారును లారీ ఢీకొన్నది. మంచిర్యాల వైపు వెళ్తున్న కారు పెట్రోల్ బంక్ నుంచి రాజీవ్‌రహదారిపైకి రాగానే అదే దారిలో వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో కారు బోల్తాపడింది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో ప్రయాణిస్తున్న రమేష్, రాకేష్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ట్రస్టు చేయూత

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 31: కరీంనగర్‌లోని పద్మనాయక వెలమ సంఘం బాలికల వసతిగృహంలో ఉంటూ చదువుకునే ఇద్దరు పేద విద్యార్థినులకు శనివారం కేశవరావు మెమోరియల్ ట్రస్టు ఫౌండర్ వెలిచాల ప్రేమ్‌చందర్‌రావు ఆర్థిక సహాయం అందించారు. ఇద్దరు విద్యార్థినులకు 25 వేల చొప్పున చెక్‌లను స్కాలర్‌షిప్ రూపంలో అందజేశారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలని ఉపాధ్యాయుల నిరసన


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న టీచర్లు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 31: కొత్త పెన్షన్ స్కీమ్ అమలులోకి తేవడాన్ని నిరసిస్తూ మండల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ సీపీఎస్ విధానం వలన ఉద్యోగులకు సామాజిక భద్రత ఉండదని, అలాగే కేంద్ర ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో యూపీఎస్(యునైటెడ్ పెన్షన్ స్కీమ్) విధానాన్ని తీసుకవస్తామని ప్రకటించడాన్ని కూడా వ్యతిరేకిస్తున్నామని, సీపీఎస్, యూపీఎస్ రెండు రకాల పింఛను విధానాలు వద్దని, పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే కోరుకుంటున్నామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ ప్రతినిధులు ముంజాల హరికృష్ణగౌడ్, గుండ మల్లిఖార్జున్, పార్థసారధి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాబోయే 24 గంటల పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు జిల్లాలో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వీటి వల్ల పెద్ద ఎత్తున వరదలు వచ్చే ప్రమాదం ఉందని, దీనిని గమనించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అధికారి హెడ్ క్వార్టర్ మెయింటెయిన్ చేయాలని, రోడ్ల పై వరద నీటిని ఎప్పటికప్పుడు మున్సిపల్ అధికారులు స్థానిక సంస్థ సిబ్బంది క్లియర్ చేయాలని, విద్యుత్ సరఫరా తాగునీటి సరఫరా ఎప్పటికప్పుడు పునరుద్ధరణ చేసేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 14,302 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. కడెం ప్రాజెక్టు నుంచి 4003 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 10,299 క్యూసెక్కుల వర దనీరు వస్తున్నది. ఇక్కడినుంచి నంది పంప్‌హౌస్‌లోని 2 మోటార్ల ద్వారా గాయత్రి పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి మిడ్‌మానేరుకు 6,300క్యూసెక్కుల నీటిని, ఎన్టీపీసీ, హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు 280క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లో 6580క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 18.063 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 31: విద్యార్థులు అకాడమిక్ నైపుణ్యాలతో పాటు, ప్రజా నిర్వహణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఐసిఎఫ్ఎఐ స్కూల్ డిప్యూటి చీఫ్ మేనేజర్ సురేష్ టకసీ అన్నారు. శనివారం నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో లుమినస్ ఫీస్టా2024 మేనేజ్‌మెంట్ మీట్ వేడుకలను కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డితో కలిసి జ్యోతిప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఐఐఎం లాంటి జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలలో ప్రవేశా లను పొందడానికి క్యాట్, మ్యాట్ లాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల కరస్పాం డెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ క్లబ్ నిర్వహణ విద్యార్థినులు నిర్వహించిన వివిధ రకాల ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

రేపు బోవేరా జయంతి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 31: స్వాతంత్ర్య సమరయోధుడు, సమసమాజ స్వాప్నికుడు, విశ్వబంధు డాక్టర్ బోయినపల్లి వేంకటరామారావు 104వ జయంతిని సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ముఖరంపుర, పద్మనాయక కల్యాణమండపం హాల్ నెం-2లో నిర్వహించనున్నట్లు బోవేరా సంస్థల అధ్యక్షుడు బోయినపల్లి హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యేడు మాజీ సిబిఐ అధికారి, సామాజికవేత్త, యువత వ్యక్తిత్వ నిర్మాణ మార్గదర్శకుడు జెడి లక్ష్మీనారాయణ బోవేరా స్మారకోపన్యాసం చేస్తారని, ప్రజా యుద్ధ నౌక, వాగ్గేయకారుడు గద్దర్‌కు మరణానంతరం ఆయన సతీమణి విమలా గద్దర్‌కు, తనయుడు సూర్యకిరణ్‌కు బోవేరా కవితా పురస్కారం ప్రదానం చేయనున్నామని తెలిపారు. ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్, అతిథులుగా ఎంఎల్‌సీ, విద్యావేత్త ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర తొలి స్పీకర్, ఎంఎల్‌సి ఎస్ మధుసూదనాచారి, రాష్ట్రగీత కర్త, కవి అందెశ్రీ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మేయర్ సునీల్‌రావు హాజరౌతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధులు, వారి వారసులు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు, బోవేరా అభిమానులు, విద్యార్థులు, నగరవాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభించుటకు కావలసిన అన్ని ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేయాలని సంబంధిత విభాగాల అధికారులను అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. శనివారం తన ఛాంబర్‌లో ఆయన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఉండేటట్లుగా చూసుకోవాలని, నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోళ్ళు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్(సివిల్ సప్లయీస్) నుంచి కేటాయించిన రైస్‌మిల్లులకు మాత్రమే ధాన్యం సరఫరా చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కేటాయించని రైస్ మిల్లులకు ధాన్యం సరఫరా చేయరాదని అలా చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'ఎఫ్ఎల్ఎన్'లో జిల్లాను అగ్రభాగాన నిలిపేందుకు కృషి చేయాలి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 31: ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పగడ్బందీగా అమలుచేస్తూ జిల్లాను అగ్రభాగాన నిలపాలని సమగ్రశిక్ష జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పీఎం షైక్ అన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని జడ్‌పీ హైస్కూల్లో శనివారం స్కూల్‌కాంప్లెక్స్ శిక్షణా చివరిరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పీఎం షైక్ మాట్లాడుతూ సామర్థ్యాల ఆధారంగా, సరైన టీఎల్ఎంతో కృత్యాధార బోధన చేయడం వల్ల పిల్లల్లో అభ్యాసనం వేగవంతం అవుతుందన్నారు. పిల్లలు నిర్దేశించిన అంశాలను శాశ్వతంగా గుర్తుంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లల్లో సమయస్ఫూర్తితో పాటు జీవన గమనంలో సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలి, ఎలా పరిష్కరించుకోవాలనే సామర్థ్యాలు పెంపొందుతాయన్నారు. ఎఫ్ఎల్ఎన్, న్యాస్ కార్యక్రమాల విజయవంతానికి ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని కోరారు. స్కూల్‌కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో పకడ్బందీగా అమలుచేసినప్పుడు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌వో మహేష్, కాల్వశ్రీరాంపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నరెడ్ల సునీత, ఆర్‌పీలు వీ సదయ్య, జీ మల్లికార్జున్, ఈర్ల సమ్మయ్య, సీఆర్‌పీ కుంట కుమారస్వామి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

-రూరల్ ఏసీపీ వెంకటరమణ

కరీంనగర్ రూరల్, ఆగస్టు 31: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని రూరల్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. శనివారం తీగలగుట్టపల్లి ఎస్‌వీజేసీ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేసి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌వీజేసీ విద్యా సంస్థల సెక్రెటరీ ఊట్కూరి మహిపాల్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ మేడం వెంకట వరప్రసాద్, కాంతాల రామ్‌రెడ్డి, జాన్సన్ గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ, కోరాస్కూల్ డైరెక్టర్ వంగల సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన మాంసం వ్యర్థాలు..

- దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

జూలపల్లి, ఆగస్టు 31 : మండలంలోని కొందరు మాంసం విక్రయదారులు, హోటల్ నిర్వాహకులు రోడ్డు పక్కనే వ్యర్థాలను పడవేస్తున్నారు. దీంతో ఆ దారి గుండా ప్రయాణించే వారికి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వడుకాపూర్, కాచాపూర్ గ్రామాల మధ్యనున్న ఒర్రె బ్రిడ్జి, వెంకట్రావుపల్లి శివారులోని రోడ్యాం, మండల కేంద్రం నుంచి వడుకా పూర్ గ్రామాల రోడ్డు మధ్యలో ఉన్న ఒర్రె రోడ్యాం, జూలపల్లి బ్రిడ్జిల వద్ద మాంసం వ్యర్థాలను రోడ్డు పక్కన పడవేస్తుండడంతో కుళ్లిపోయి భరించరాని దుర్వాసన వస్తోందని పలువురు మండిపడుతున్నారు. రోడ్డు పక్కన పడవేస్తున్న వ్యర్థపదార్థాలను తింటూ అక్కడే గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయని, ఆ దారిన వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


జూలపల్లి-వడుకాపూర్ గ్రామాల మధ్య రోడ్డు పక్కన పడవేసిన వ్యర్థాలు



ఓసీపీ-1ను సందర్శించిన జీఎం ఎన్విరాన్‌మెంట్

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 31: జీఎం ఎన్విరాన్‌మెంట్ మనోహర్ శనివారం ఓసీపీ-1 ప్రాజెక్టును సందర్శించారు. వ్యూ పాయింట్ నుండి పని స్థలాలను పరిశీలించారు. కొత్తగా ప్రారంభం కానున్న రామగుండం కోల్‌మైన్‌తో పాటు ఓసీపీ-1 విస్తరణ కోసం ప్రతిపాదనలను అడిగితెలుసుకున్నారు. రెమెడియేషన్ ప్లాన్ స్థితి గతుల వివరాలను తెలుసుకున్నారు. 94.83శాతం రెమెడియేషన్ ప్లాన్ సాధించినందుకు పీవో రాధాకృష్ణను జీఎం మనోహర్ అభినందించారు. పర్యావరణ అనుమతుల స్థితిగతులు, పనులను ఆయన పరిశీలించారు. ఓసీపీ-1లో ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ప్రాజెక్టు ఆఫీస్ ఆవరణలో మొక్కలు నాటారు. జీఎం మనోహర్ వెంట ఆర్జీ-3 యాక్టింగ్ జీఎం, పీవో రాధాకృష్ణ, మేనేజర్ ఉదయ్‌హరిజన్, డీజీఎం ఎన్విరాన్‌మెంట్ రాజారెడ్డి, ప్రాజెక్టు ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ కిషన్, ఫారెస్ట్‌ఆఫీసర్ కళ్యాణ్, సేఫ్టీఆఫీసర్ శ్రీనివాసరావు ఉన్నారు.

ఓసీపీ-2 కార్మికుడికి పదవి విరమణ సత్కారం

రామగిరి, ఆగస్టు 31: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-2లో ల్యాంప్ రూమ్ అటెండెంటుగా సేవలందించి శనివారం పదవీవిరమణ పొందిన వెముల వెంకటేశ్వర్లును పీవో వెంకటరమణ, మేనేజర్ రామారావు, ఉద్యోగులు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. మాజీ సర్పంచ్ ఎండి మంజూర్ సలీం, రవీందర్, స్వీట్ రాజు, కొలిపాక సారయ్య, తిరుమల్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

దళిత కార్మికురాలికి న్యాయం చేయండి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 31: సింగరేణి ఆర్జీ-1 వన్‌ఇంక్లయిన్‌లో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్ దళిత కార్మికురాలు జనగామ స్వప్నపై కులం పేరుతో దూషించి దాడిచేసిన ఏఐటీయూసీ నాయకుడు మడ్డి ఎల్లయ్యగౌడ్, అతని కొడుకు, అనుచరులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. శనివారం గోదావరిఖనికి వచ్చిన భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొంకూరి మధు, కాంపెల్లి సతీష్, పులి మోహన్, జనగామ నర్సయ్య, బూడిద మహేందర్ తదితరులు ఉన్నారు.

మేడిపల్లి ఓసీపీని పరిశీలించిన భట్టి, మంత్రులు

- 500మెగావాట్ల సంప్‌డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కసరత్తు - నివేదిక రూపొందించాలంటూ ఆదేశం


మ్యాప్‌ను పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క, మంత్రులు

గోదావరిఖని, ఆగస్టు 31: సింగరేణి ఆధ్వర్యంలో ఆర్జీ-1లో మూతపడిన మేడిపల్లి ఓసీపీలో 500 మెగావాట్ల సంప్‌డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సంపూర్ణ సమాచారంతో నివేదిక సమర్పించాలని, ఇది ఒక వినూత్న ఆలోచన కనుక కంపెనీకి లాభసాటిగా ఉంటే నిర్మాణం చేపట్టవచ్చని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శనివారం రామగుండం పర్యటనకు వచ్చిన ఆయన సంప్‌డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మించ తలపెట్టిన మేడిపల్లి ఓసీపీని పరిశీలించి సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్లతో ప్లాంట్ ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. డిప్యూటీ సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సీఎండీ బలరామ్ ప్లాంట్ వివరాలను ప్రతిపాదనలను మంత్రులకు వివరించారు. మూతపడిన మేడిపల్లి ఓసీపీ సంపులో పెద్ద మొత్తంలో నీరు ఉందని. ఈ నీటిని శక్తివంతమైన పంపుల ద్వారా సోలార్ విద్యుత్ సహకారంతో పైకి తోడి 157 మీటర్ల ఎత్తున భూమి ఉపరితలంపై నిర్మించే భారీ జలశయంలోకి నింపనున్నట్టు తెలిపారు. రాత్రివేళ ఇదే నీటిని భూమి ఆకర్షణ పద్ధతిలో కిందికి పంపిస్తూ, జనరేటర్ల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ తరహా ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా రానున్నాయని, మేడిపల్లి ఓసీపీ ప్రాంతం సింగరేణి ఆధీనంలో ఉన్నందున అదనంగా ఎటువంటి భూసేకరణ లేకుండానే ప్రాజెక్టును విజయవంతంగా చేపట్టవచ్చని వివరించారు. దీనిపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రితో పాటు మంత్రులు చర్చించారు. అనంతరం ఇది ఒక మంచి ఆలోచనని అయితే సమగ్ర నివేదిక రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ప్రాజెక్టు లాభదాయకంగా ఉంటే సింగరేణి సంస్థ ద్వారా త్వరలోనే చేపట్టవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, సింగరేణి డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎండీ పరామర్శ

రామగిరి, ఆగస్టు 31: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఉప్పల వెంకటేశ్వర్లు కుటుంబాన్ని శనివారం రాత్రి సింగరేణి సీఎండీ బలరాంనాయక్ పరామర్శించారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి వెంకటరమణ, ట్రేడ్ యూనియన్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, వైవీ రావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సంక్షేమాధికారికి సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 31: ఆర్కే-6 సంక్షేమాధికారిగా పనిచేసి బదిలీపై కార్పొరేట్ (ఎడ్యుకేషన్)కు వెళ్తున్న డిప్యూటీ పర్సనల్ మేనేజర్ కె. సునీల్ కుమార్‌ను గని ఉద్యోగులు, పలు కార్మిక సంఘాల నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ తిరు పతి మాటాడుతూ సునీల్ కుమార్ ముందుండి గనిని సంక్షేమ పథంలో నడిపించారని, కార్మికుల ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె. శంకర్‌రావు,రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి సంపుం సదానందం, నాయకులు చిలుక రాంచందర్, తోట మహేష్, నగేష్, సంతోష్ పాల్గొన్నారు.

అల్ఫోర్స్ పాఠశాలలో మాక్ అసెంబ్లీ

సుల్తానాబాద్, ఆగస్టు 31: సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో శనివారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. పాఠ్యాంశాలలో భాగంగా ఏడు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు అసెంబ్లీలో జరిగే సమావేశాల తీరుతెన్నులు, విధి విధానాలను ఉపాధ్యాయులు వివరించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి, గవర్నర్, ప్రతిపక్ష నేతలు వ్యవహరించే తీరుతెన్నులు, వారి ప్రసంగాలు, లేవనెత్తే ప్రశ్నలు, సమాధానాల గురించి మాక్ అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సురేష్

సుల్తానాబాద్, ఆగస్టు 31: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించేలా చూడాలని జిల్లా క్రీడా యువజన శాఖ అధికారి సురేష్ పాఠశాలల నిర్వాహకులకు సూచించారు. మూడు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి శనివారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సురేష్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలని సూచించారు. సాన్వి డిఫెన్స్ అకాడమీ వారు విజేతలకు బహుమతులను సమకూర్చగా వాటిని క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మినుపాల ప్రకాశ్‌రావు, ఫెడరేషన్ పెద్దపల్లి జోనల్ కన్వీనర్ దాసరి రమేష్, మండల కన్వీనర్ ప్రణయ్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, సెయింట్ మేరీ స్కూల్ కరస్పాండెంట్ షౌరెడ్డి, సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేముల కిరణ్ తదతరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోల్‌సిటీటౌన్, ఆగ స్టు 31: ఇటీవల ఎన్‌టీపీసీ జెడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో జరిగిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో గోదావరిఖని ఇండో అమెరికన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బాలుర ఖోఖో, కబడ్డీ, బాలికల ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలను కైవసం చేసుకున్నారు. ఖోఖోలో రామ్‌చరణ్, మల్లిక వర్మ, రవికిరణ్, అలేఖ్య ప్రథమ స్థానం సాధించారు. అథ్లెటిక్స్‌లో దివ్య, భవ్య, సందేశ్‌లు 100, 600 మీటర్ల పరుగుపందెం పోటీలలో ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకొని జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కాగా విజేతలను పాఠశాల డైరెక్టర్ హేమలత, ప్రిన్సిపల్ శ్రీనివాస్, పీఈటీ రామంచ నర్సింగరావు, ఎంఈవో ఆరెపల్లి రాజయ్య అభినందించారు.

●పాలకుర్తి, ఆగస్టు 31: జీడినగర్ పంచాయతీ పరిధిలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)జోనల్ స్థాయి క్రీడా పోటీలలో ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్ శనివారం తెలిపారు. ఈనెల 28,29,30న గోదావరిఖని, ఎన్టీపీసీలో నిర్వహించిన పోటీలలో శ్రావణ్, రాజేష్, రంజిత్, ఎం హర్షవర్ధన్, జి శివరామ్, తనుష్, సాయిఅక్షయ్, అరవింద్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్, పీఈటీ సంతోష్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

సఖి సేవలపై విద్యార్థులకు అవగాహన

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 31: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం సఖీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ దారవేణి స్వప్న , లీగల్ కౌన్సిలర్ గుర్రాల సుమతిలు మహిళలపై దాడులు చేయడం, అసభ్యంగా ప్రవర్తించడం , ఫోన్ ద్వారా అసభ్యకరంగా మాట్లాడటం, సైబర్ నేరాలు, వరకట్న నిషేధం, ఇటీవల మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల వాటిని వివరిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటిని ఏవిధంగా ఎదుర్కోవాలో అనే అంశాలపై వివరించారు. మహిళల సహాయం కోసం 181 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవిందర్, అధ్యాపకులు, విద్యార్తులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు సన్మానం


డిప్యూటీ సీఎంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఆగస్టు 31: జిల్లా పర్యటనలో భాగంగా శనివారం సుల్తానాబాద్ మీదుగా వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులకు ఎమ్మెల్యే విజయరమణారావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పలువురు నాయకులు కూడా డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వేణుగోపాల్ రావు, ఎంపీ వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ తదితరులకు పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో మినుపాల ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, పన్నాల రాములు, దామోదర్ రావు, కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వేగోలం అబ్బయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

●పెద్దపల్లి టౌన్, ఆగస్టు 31: రామగుండం పర్యటన సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గం మీదుగా రోడ్డు మార్గంలో వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర సలహాదారులు వేణుగోపాల్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెరువుల కబ్జాపై విచారణ చేపట్టాలి


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న మత్స్యకారులు

ఓదెల, ఆగస్టు 31: ఓదెల గ్రామపంచాయతీ పరిధిలో కబ్జాకు గురవుతున్న చెరువులు, కుంటలపై విచారణ జరిపించాలని శనివారం తహసీల్దార్ యాకయ్యకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. మల్లన్నకుంటకున్న పురాతన మత్తడిని పూడ్చివేసి కబ్జా చేస్తున్నారని దీంతో మల్లన్నకుంటతో పాటు ఓదెల శివారులోని కుంటలు, చెరువుల విస్తీర్ణం తగ్గిందని మత్స్యకారులు తెలిపారు. అక్రమంగా కుంటలు కబ్జాకు గురవుతుండడంతో చేపల పెంపకం కోసం విస్తీర్ణం తగ్గి జీవనోపాధి కోల్పోతున్నామని వారు తెలిపారు. సహకార సంఘం అధ్యక్షుడు మంద కొమురయ్య, ఉపాధ్యక్షుడు పెండెం రాములు, తూడి సురేష్, పసెట్ల స్వామి, తూడి ప్రవీణ్, పిట్టల రవి, పిట్టల నర్సింగం, తీగల సదానందం, తూడి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.